నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I | హైదరాబాద్, శనివారం 4 జనవరి 2025 | RANGAREDDY


## బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల రూరల్, జనవరి 3 : బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని కేసారం గ్రామ రెవెన్యూలోని బృందావన్‌కాలనీలో శ్రేణులతో సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలంటూ ప్రజలను మభ్యపెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నదన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ మోసాలను ఎండగట్టాలన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర కనీస వేతన సలహా మండలి మాజీ చైర్మన్ పీ నారాయణ, తెలంగాణ ఉద్యమకారుడు దేశమల్ల ఆంజనేయులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, నాయకులు విఘ్నేశ్ గౌడ్, బ్యాగరి సుదర్శన్ తదితరులు ఉన్నారు.

## మహనీయుల స్ఫూర్తి, ఆశయాలతో ముందుకు సాగాలి



పూలే చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జనవరి 3 : మహనీయుల స్ఫూర్తి, ఆశయాలతో ముందుకు సాగాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, డీఈవో రేణుకాదేవి, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలేలు సాంఘిక దురాచారాలను అరికడుతూనే.. మహిళల విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డీపీవో జయసుధ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సత్తార్, వివిధ శాఖల అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పథకంపై.. అయోమయం

- ఇల్లు ఇప్పిస్తామంటూ మోసం చేస్తున్న కేటుగాళ్లు
- ఇటీవల ధారూరులో ముగ్గురు వద్ద డబ్బులు వసూలు
- ప్రజల్లో అవగాహన లోపమే ఇందుకు కారణం
- నత్తనడకన దరఖాస్తుల పరిశీలన, 83 శాతమే పూర్తి
- జిల్లావ్యాప్తంగా 2,57,654 దరఖాస్తులు రాగా, 2.13 లక్షల అప్లికేషన్ల పరిశీలన పూర్తి



ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారుల ఎంపికపై ప్రజల్లో అయోమయ పరిస్థితి నెలకొన్నది. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నత్తనడకన కొనసాగుతున్నది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల్లో 83 శాతం దరఖాస్తుల పరిశీలనే పూర్తైంది. ఇదే అదనుగా భావించిన కొందరు కేటుగాళ్లు ఇండ్లు ఇప్పిస్తామంటూ పైసల వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటీవల ధారూరు మండలంలో ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.10 వేల చొప్పున ముగ్గురి వద్ద వసూలు చేసుకుని ఉడాయించారు. సీఎం నియోజకవర్గం కొడంగల్‌కు చెందిన వాడినని, లబ్ధిదారుల ఎంపిక జాబితాలో పేరు వచ్చేలా చూస్తానని అమాయకులను బురిడి కొట్టించాడు. పల్లె ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్లే మోసపోతున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 'ఇల్లు ఇప్పిస్తాం.. రూ.5 లక్షల ఆర్థిక సాయం కావాలంటే కొంతమేర డబ్బులు ఇవ్వాల్సిందే'నని కొందరు అధికార పార్టీ నేతలు బేరసారాలకూ దిగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఇందిరమ్మ కమిటీల్లోని సభ్యులు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కావడంతో ఈ వసూళ్ల దందాకు తెరలేపినట్లు ఊరూరా చర్చ జరుగుతున్నది.

- వికారాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ)

### సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌తోనే పరిశీలన ఆలస్యం..



ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి డిసెంబర్ చివరిలోగా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా సాంకేతిక సమస్యలతో ఇంకా కొనసాగుతున్నది. ప్రారంభంలో దరఖాస్తుదారుడికి సంబంధించిన దాదాపు 30 ప్రశ్నల వివరాలను యాప్ ద్వారా వేగంగా సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. కానీ నెట్‌వర్క్ సమస్యతో పాటు మరోవైపు యాప్ అప్‌డేట్ చేయడంతో దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ఆలస్యమవుతున్నది. ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలను 30 నిమిషాల్లో పూర్తి చేయాల్సి ఉండగా సాంకేతిక సమస్యలతో గంటకుపైగా పడుతున్నది. సంబంధిత యాప్‌ను ఇప్పటివరకు మూడు సార్లు అప్‌డేట్ చేయడం వల్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వెనుకబడింది. జిల్లావ్యాప్తంగా 2,57,654 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు 83 శాతం మాత్రమే పరిశీలన ప్రక్రియ పూర్తైంది.జిల్లాలో 2.13 లక్షల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తికాగా, మరో 44,654 దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నది. అయితే రెండు, మూడు రోజుల్లో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తవుతుందని సంబంధిత అధికారులు చెబుతున్నప్పటికీ మరో వారం రోజులకుపైగా పట్టే అవకాశం ఉన్నది.





# కార్యదర్శుల 'ప్రత్యేక' పాట్లు..

### అప్పులు చేసి పనులు.. బిల్లులు రాక ఇబ్బందులు

### అదనపు పనిభారంతో మానసిక ఒత్తిళ్లు..

*గ్రామపంచాయతీ పాలకుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక పాలన కొనసాగుతున్నది. పంచాయతీ కార్యదర్శులు అంతా తామై పల్లెల్లో పాలనను ముందుకు నడిపిస్తున్నారు. ప్రభుత్వాల నుంచి సరైన నిధులు రాకపోగా గ్రామపంచాయతీల్లో ఉన్న నిధులను కూడా డ్రా చేసుకునేందుకు వీలులేకుండా ప్రభుత్వం నిధుల విడుదలను నిలిపివేసింది. దీంతో గ్రామాల్లో చెత్తసేకరణకు ట్రాక్టర్ల నిర్వహణ, వీధిదీపాలు, పారిశుధ్యం వంటి పనులకు కార్యదర్శులు సొంతంగా డబ్బులు ఖర్చు చేశారు. కానీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులపాలై అవస్థలు పడుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ సర్కార్ మే నెల వరకు మాత్రమే బిల్లులను విడుదల చేయగా, కార్యదర్శులు చేయించిన పనులకు సంబంధించిన బిల్లులపై సంతకాలు చేయించేందుకు ప్రత్యేకాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా మారింది.*

*- రంగారెడ్డి, జనవరి 3 (నమస్తే తెలంగాణ)*

### అదనపు భారంతో మానసిక ఒత్తిళ్లు..

ప్రత్యేక పాలనలో పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారింది. ఇప్పటికే అప్పులు చేసి పనులు నిర్వహిస్తే.. బిల్లులు రాక గోస పడుతుంటే.. ప్రభుత్వం అదనపు పనిభారాన్ని మోపుతూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యేలా చేస్తున్నది. ఇందిరమ్మ ఇండ్ల సర్వేతో పాటు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, కులగణన సర్వే చేసి, ఆన్‌లైన్‌లో పొందుపర్చే బాధ్యతనూ కార్యదర్శుల నెత్తిమీదే పెట్టింది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను వివిధ శాఖల అధికారులు పరిశీలించినప్పటికీ వాటిని కంప్యూటర్‌లో పొందుపరిచే బాధ్యతను సెక్రటరీలకే అప్పగించింది. దీనికితోడు సకాలంలో పనులు చేయలేదంటూ మెమోలు జారీ చేస్తూ మనోవేదనకు గురిచేస్తున్నది.

### పల్లెల్లో పంచాయతీ కార్యదర్శుల పాత్ర..

జిల్లాలో 549 గ్రామపంచాయతీల్లో సుమారు 500 మందికి పైగా కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామాల్లోని అన్ని పనుల్లో వీరే కీలక పాత్ర పోషిస్తున్నారు. నిత్యం ఉదయం నుంచి సాయంత్రం వరకు పనుల్లో తలమునకలవుతున్నారు. ప్రతిరోజూ ఉదయం సరైన సమయానికి జీపీఎస్ అప్లోడ్ చేయలేకపోతే మెమోలు జారీ చేయడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. గ్రామాల్లో నర్సరీల నిర్వహణ, చెత్తసేకరణ, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ, పల్లె ప్రకృతి వనాలు, వర్మీకంపోస్టుయార్డులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల అందజేత, పన్నుల వసూళ్లు, పింఛన్ల పంపిణీ పర్యవేక్షణ వంటి పనులు నిత్యకృత్యంగా ఉంటాయి. దీంతోపాటు అదనంగా ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన, కులగణన సర్వే, ఇందిరమ్మ ఇండ్ల సర్వే, సర్వేకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చటం వంటివి..

### అదనపు పని భారం తగ్గించి, పెండింగ్ బిల్లులు చెల్లించాలి..



పంచాయతీ కార్యదర్శులకు అదనపు పని భారాన్ని తగ్గించాలి. నిత్యం ఉదయం లేచింది మొదలుకుని చేసే పనుల నిర్వహణతోనే సతమతమవుతున్నాం. ఇందిరమ్మ ఇండ్ల సర్వే, కుటుంబ సర్వే అంటూ అదనపు పని భారాన్ని మోపడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రత్యేక పాలనలో పనుల నిర్వహణ కోసం అప్పులు చేశాం. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని వేడుకుంటున్నా.

– శ్రీకాంత్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు

# కాంగ్రెస్‌లో వర్గ పోరు

- పీఏసీఎస్ నూతన చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఫ్లెక్సీల రగడ
- తమ నాయకుల ఫొటోలు లేవంటూ ఆందోళన.. ఫ్లెక్సీల చించివేత
- కార్యకర్తల అరెస్ట్.. పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- ఆందోళన తర్వాత చైర్మన్ ప్రమాణ స్వీకారం
- ఓటేసి గెలిపిస్తే అరెస్ట్ చేయిస్తారా..అంటూ ఆగ్రహం

దోమ, జనవరి 3 : మోత్కూర్ పీఏసీఎస్ నూతన చైర్మన్ ప్రమాణస్వీకారోత్సవంలో వర్గపోరు భగ్గుమన్నది. శుక్రవారం పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా ఆగిరాల యాదవరెడ్డి ప్రమాణస్వీకారం చేయాల్సి ఉండగా, పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం సందర్భంగా దోమ మండల కేంద్రంలో ఉన్న మోత్కూర్ పీఏసీఎస్ కార్యాలయం ఎదుట, పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే ఫ్లెక్సీలలో తమ నాయకుల ఫొటోలు లేవంటూ కాంగ్రెస్ పార్టీలోని ఓ వర్గం ఆందోళనకు దిగింది. పోలీసులు చూస్తుండగానే ఫ్లెక్సీలను చించివేయడంతో గందరగోళం నెలకొన్నది. దీంతో కాంగ్రెస్ శ్రేణులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టగా, ఈ గొడవ కాస్త హైకోర్టు వరకు వెళ్లింది. 13 మంది డైరెక్టర్లలో 10 మంది డైరెక్టర్లు మద్దతు తెలుపడంతో నూతన చైర్మన్ ఎన్నికకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే.



కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

### ఆందోళన తర్వాత చైర్మన్ ప్రమాణస్వీకారోత్సవం..

కాంగ్రెస్ శ్రేణుల మధ్య జరిగిన వర్గపోరు అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో చైర్మన్‌గా ఆగిరాల యాదవరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సహకరించిన డైరెక్టర్లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమం తరువాత దోమ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ టీచర్స్ ఉపాధ్యాయ యూనియన్ నాయకులతో కలిసి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీవో నాగలింగాచారి, సీఈవో యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి, డైరెక్టర్లు, యువ నాయకులు శాంతకుమార్, శ్రీకాంత్‌రెడ్డి, యాదయ్యగౌడ్, మొగులయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దోమలో పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న యాదవరెడ్డి

## ఓటేసి గెలిపిస్తే అరెస్ట్ చేయిస్తారా..?



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఓ వర్గం కార్యకర్తలు

ఓటేసి గెలిపిస్తే అరెస్ట్ చేయిస్తారా.. అంటూ కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడవ తర్వాత మరో వర్గానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు మండల కేంద్రంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఏసీఎస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో సీనియర్ నాయకుల ఫొటోలు లేకపోవడం బాధాకరమన్నారు. ఒకే పార్టీలో ఉంటూ ఇలాంటి వ్యత్యాసాలు చూపడం సరికాదని, కాంగ్రెస్‌లో వర్గపోరు కుంపటి మంచిది కాదని, ఎమ్మెల్యేను కలిసి చెబుదామని వెళ్తున్న తమను అరెస్టు చేయించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఇక నుంచి కాంగ్రెస్ పార్టీకిగాని, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి గాని తాము మద్దతు తెలుపబోమని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో కాంగ్రెస్ పార్టీ దోమ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్, బాబు, షబ్బీర్, యాదగిరి, నవీన్‌కుమార్‌రెడ్డి, జావీద్, రవి తదితరులు ఉన్నారు.



# హైడ్రాలో 970 ఔట్ సోర్సింగ్ పోస్టులు

### ఫుట్‌పాత్‌లతో పాటు పలు ఆక్రమణలను తొలగించడమే లక్ష్యం

### తాత్కాలిక ఉద్యోగుల జీతాల ఖర్చు రూ.31.70కోట్లుగా అంచనా





సిటీబ్యూరో: హైడ్రాలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి అడుగులు వేస్తోంది. అతి త్వరలో 970 కాంట్రాక్ట్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు హైడ్రా అధికారులు తెలిపారు. కొత్తగా వచ్చే అధికారులకు ఎలాంటి బాధ్యతలు ఇవ్వాలో కూడా నిర్ణయించినట్లు తెలిసింది. ఈ ఏజెన్సీ ఒక సంవత్సరం పాటు అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన 203 మంది మేనేజర్లు, 767 మంది అసిస్టెంట్లను నియమించనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల హైడ్రా పరిధిలో ఉన్న నీటి వనరులు, పార్కులు, ప్రభుత్వభూములు, నాలాలను రక్షించడంలో హైడ్రాకు సహాయం చేయడం, అనధికార నిర్మాణాలు, ఆక్రమణలను గుర్తించడం వీరి బాధ్యతగా నిర్ణయించారు. హైదరాబాద్‌లోని ఫుట్‌పాత్‌లతో పాటు జలవనరులు, ప్రభుత్వస్థలాల్లో వెలసిన ఆక్రమణలను తొలగించడంలో వీరిదే కీలక పాత్ర అని అధికారులు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులను ఏడు ప్యాకేజీలుగా విభజిస్తారు. మేనేజర్లకు రెండు, అసిస్టెంట్లకు ఐదు ప్యాకేజీలు ఉంటాయి. వీరి జీతాల కోసం మొత్తం ఖర్చు సంవత్సరానికి రూ.31.70 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.